بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 09 January 2026 (Telugu)

## వఖ్ఫె జదీద్ 68వ సంవత్సరంలో జమాఅత్ సభ్యుల ద్వారా చేయబడిన ధన త్యాగాల ప్రస్తావన, 69వ వార్షిక ప్రారంభోత్సవ ప్రకటన

**హజ్రత్ అమీరుల్ మూమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 09.01.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشۡهَدُ أَنۡ لَّآ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ۔ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ۔
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ اِيَّاكَ نَعۡبُدُ وَاِيَّاكَ نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఆలె ఇమ్రాన్ అధ్యాయపు 93వ సూక్తిని పఠించి దాని అనువాదం వినిపిస్తూ ఇట్లు ఉపదేశించారు. మీరు ప్రేమించే వస్తువుల నుండి అల్లాహ్ తఆలా మార్గంలో ఖర్చు చేయనంత వరకు మీరు సంపూర్ణ పుణ్యాన్ని పొందలేరు మరియు మీరు దేనిని ఖర్చు చేసినా అల్లాహ్‌కు దాని గురించి బాగా తెలుసు. ఇట్లనిరి. దీని వ్యాఖ్యానంలో హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ రజియల్లాహు అన్హు ఇలా వ్రాశారు. పవిత్ర ఖుర్‌ఆన్‌లోని బఖరా అధ్యాయపు మొదటి రుకూ ప్రారంభమయ్యే చోట, ముత్తఖీన్ (దైవభీతి గలవారి) గురించి ఇలా చెప్పబడింది: وَمِمَّا رَزَقۡنٰهُمۡ يُنۡفِقُوۡنَ అనగా అల్లాహ్ తఆలా వారికి ఇచ్చిన దాని నుండి వారు ఖర్చు చేస్తారు. ఇది మొదటి రుకూ ప్రస్తావన. ఆ తరువాత ఈ అధ్యాయంలో అనేక చోట్ల అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం (ఇన్ఫాఖ్ ఫీ సబీలిల్లాహ్) గురించి ఎంతో నొక్కి చెప్పబడింది. కావున మీరు మీ ధనాన్ని ఖర్చు చేసే వరకు నిజమైన పుణ్యాన్ని పొందనే పొందలేరు. నా ఉద్దేశ్యంలో مِمَّا تُحِبُّوۡنَ అనగా ధనం. ఎందుకంటే అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు: وَاِنَّهٗ لِحُبِّ الۡخَيۡرِ لَشَدِيۡدٌ అనగా మనిషికి సంపద అంటే ఎంతో ఇష్టం. కావున నిజమైన పుణ్యాన్ని పొందాలంటే మీరు ఇష్టపడే మీ సంపద నుండి ఖర్చు చేస్తూ ఉండటం అవసరం.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం కూడా దీనిని వివిధ చోట్ల వ్యాఖ్యానించారు. ఒక చోట వారు అలైహిస్సలాం ఇలా ప్రవచించారు. పనికిరాని మరియు తక్కువ విలువైన వస్తువులను ఖర్చు చేయడం ద్వారా ఏ వ్యక్తి కూడా పుణ్యం చేస్తున్నానని చెప్పుకోలేడు. పుణ్యానికి ద్వారం చాలా ఇరుకైనది, కాబట్టి పనికిరాని వస్తువులను ఖర్చు చేయడం ద్వారా ఎవరూ అందులోకి ప్రవేశించలేరని గుర్తుంచుకోండి. ఒకవేళ మీరు కష్టపడాలని అనుకోకపోతే, నిజమైన పుణ్యాన్ని స్వీకరించకపోతే, మీరు ఎలా విజయం సాధించగలరు మరియు మీ లక్ష్యాన్ని ఎలా చేరుకోగలరు.

హుజూరె అన్వర్ దృష్టి వహించాలని సూచిస్తూ ఇలా అన్నారు. కొన్నిసార్లు బాగా సంపాదించే వారు తమ ఆర్థిక త్యాగాలలో ఒక సామాన్య లేదా సగటుగా సంపాదించే అహ్మదీ స్థాయికి అనుగుణంగా

ఉండరు. అటువంటి వారు ఆలోచించవలెను. అసలైన త్యాగం అంటే మీకు ఇష్టమైన దానిని అల్లాహ్ తఆలా మార్గంలో ఖర్చు చేయడమే అని అల్లాహ్ ఉపదేశిస్తున్నాడు. అప్పుడే మీరు అల్లాహ్ ప్రసన్నతను పొందగలరు మరియు అతని అనుగ్రహాలకు వారసులు కాగలరు. అల్లాహ్ తఆలా కేవలం ఒకటి రెండు చోట్ల మాత్రమే కాకుండా పవిత్ర ఖుర్ఆన్‌లో అనేక చోట్ల అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయమని ఆదేశించాడు.

హుజూరె అన్వర్ ఇంకా సూచించారు. జమాఅత్‌లో అధిక ప్రజలు ఆర్థిక త్యాగాలలో ఎంతో సంతోషంగా పాల్గొనడం అల్లాహ్ తఆలా అనుగ్రహమే. అయితే ఎవరిలోనైనా సంకోచం ఉంటే, వారు అల్లాహ్ తఆలా మార్గంలో ధనాన్ని ఖర్చు చేయడం అవసరమని అల్లాహ్ చెప్పిన మాటను గుర్తుంచుకోవాలి. ఎక్కువ సంపాదించే వారిలో కొందరు నిశ్చయంగా వివిధ పథకాలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు, కానీ ఇక్కడ సందర్భవశాత్తు నేను ఇది కూడా చెబుతున్నాను. అనగా వారు తమ ఆదాయంపై చెల్లించాల్సిన చందా (చందా ఆమ్) సరైన శాతంతో చెల్లించడం లేదు మరియు అందులో క్రమబద్ధంగా లేరు. కాబట్టి అటువంటి వారు తమను తాము ఆత్మపరిశీలన చేసుకోవాలి.

హదీసులలో కూడా అల్లాహ్ తఆలా దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అనేక చోట్ల ఆర్థిక త్యాగం చేయాలని మనకు నొక్కి చెప్పారు. హజ్రత్ హసన్ రజియల్లాహు అన్హు నుండి ఒక కథనం ఇట్లు లభిస్తుంది. ఇది ఒక హదీసె ఖుద్సీ. అల్లాహ్ తరఫున మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా ఉపదేశించారు: ఓ ఆదమ్ కుమారుడా! నీ ఖజానాను (నిధిని) నా వద్ద జమ చేసి నిశ్చింతగా ఉండు. దానికి అగ్ని ప్రమాద భయం లేదు, నీటిలో మునిగిపోయే ప్రమాదం లేదు మరియు దొంగలు దొంగిలిస్తారన్న భయం లేదు. నా వద్ద ఉంచబడిన ఆ ఖజానాను, నీకు అత్యంత అవసరమైన ఆ రోజున నేను నీకు పూర్తిగా తిరిగి ఇస్తాను.

హుజూరె అన్వర్ ఇట్లు ప్రవచించారు. నేడు అధిక అహ్మదీయులకు ఈ అవగాహన ఉండటం మన అదృష్టం, వారు అల్లాహ్ తఆలా మార్గంలో అపారంగా ఖర్చు చేస్తున్నారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం కాలంలో కూడా ఇటువంటి త్యాగాలకు ఉదాహరణలు ఉన్నాయి. నిజానికి వాటిని చూసి ఆయన అలైహిస్సలాం ఒకసారి ఇలా అన్నారు. పేద ప్రజలు ధర్మం (మతం) కోసం ఇంతటి త్యాగాలు ఎలా చేస్తున్నారో చూసి నేను ఆశ్చర్యపోతున్నాను. నేడు కూడా అదే పరిస్థితి ఉంది. పేదవారు లేదా సగటు తరగతి సంపాదించేవారు చాలా పెద్ద త్యాగాలు చేయడం నేను చూశాను, ఎందుకంటే ఈ సంపదను అల్లాహ్ తఆలా మనకు తిరిగి ఇస్తాడని లేదా మనం అల్లాహ్ అనుగ్రహాలకు వారసులమవుతామని వారికి తెలుసు. అది ఎలా? అది అల్లాహ్‌కు బాగా తెలుసు. ఈ లోకంలోనూ మరియు పరలోకంలోనూ కూడా. అసలు విషయం ఏమిటనగా పరలోకంలో అల్లాహ్ దానిని తిరిగి ఇస్తాడు, దాని పుణ్యంలో భాగం చేస్తాడు మరియు ఈ త్యాగాలు వారి అంతస్తుల పెంపునకు కారణమవుతాయి.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇట్లు ఉపదేశించారు. మనం దైవభీతి మరియు పవిత్రతలో ఎంతవరకు పురోగతి సాధించామో ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. దీనికి పవిత్ర ఖుర్ఆన్ ఒక ప్రమాణం. అల్లాహ్ ముత్తఖీ (దైవభీతి గలవారి) గుర్తులలో ఒక గుర్తుగా దీనిని పెట్టాడు. అల్లాహ్ ముత్తఖీని (నిష్టాపరున్ని) ప్రపంచ ఇబ్బందుల నుండి విముక్తుడిని చేసి, అతని పనులకు స్వయంగా బాధ్యత వహిస్తాడు.

ఆ తరువాత హుజూరె అన్వర్ ఇలా ఉపదేశించారు. ప్రస్తుతం నేను వఖ్ఫె జదీద్ గురించి మాట్లాడ బోతున్నాను. కాబట్టి వఖ్ఫె జదీద్ చందాలు ఇచ్చిన వారి కొన్ని ఉదాహరణలను నేను సమర్పిస్తాను, వారిపై అల్లాహ్ తఆలా ఎలా అనుగ్రహం చూపాడో లేదా వారు త్యాగం చేస్తే అల్లాహ్ తమ అవసరాలను తీరుస్తాడనే నమ్మకం మరియు విశ్వాసం వారికి ఎంతగా ఉందో తెలుస్తుంది.

ఈ నేపథ్యంలో హుజూర్ అన్వర్ ఇండోనేషియా, కెన్యా, కజకిస్థాన్ మొదలైన దేశాల ఆర్థిక త్యాగాలకు సంబంధించిన విశ్వాసాన్ని పెంపొందించే సంఘటనలను వివరించిన తరువాత ఇట్లు అన్నారు: ఇండియా నుండి అక్కడి వఖ్ఫె జదీద్ ఇన్‌స్పెక్టర్ ఇలా వ్రాశారు. ఒక జమాఅత్‌లో ఒక వ్యక్తి ఉన్నారు, అతని వద్దకు వెళ్ళినప్పుడు అతని వఖ్ఫె జదీద్ చందా పదహారు వేల రూపాయలు బకాయి ఉండెను, అతను ఒక ముఖ్యమైన వాయిదా (ఇన్‌స్టాల్‌మెంట్) చెల్లించాల్సి ఉంది. మేము అక్కడికి చేరుకున్నప్పుడు అతను ఇలా అన్నాడు, నేను చెల్లించాల్సిన నా EMI వాయిదా గురించి తరువాత చూసుకోవచ్చు, దానిని నేను ఆ తరువాత చెల్లిస్తాను, ప్రస్తుతం నా వద్ద డబ్బు ఉంది మరియు మీరు కూడా వచ్చారు కనుక మొదట నేను నా చందా బకాయిని చెల్లిస్తాను. మీరు కష్టమైన పరిస్థితుల్లో ఉన్నందున ప్రస్తుతం సగం చెల్లించండి, మిగిలినది తరువాత ఇవ్వండి అని మేము అతనితో అన్నాము. దానికి ఆయన ఇలా సమాధానమిచ్చారు, మొదట అల్లాహ్ కోసం తీయవలెను, మిగిలిన విషయాలను అల్లాహ్ తఆలా తఆలా చక్కదిద్దుతాడు. ఇన్షా అల్లాహ్. నేను నిష్టాపరతతో ఉండి, అల్లాహ్‌పై నమ్మకం కలిగి ఉంటే, అల్లాహ్ తఆలా మెరుగైన మార్గాలను ఏర్పాటు చేస్తాడు. తరువాత అతను ఫోన్ ద్వారా సమాచారం ఇస్తూ, చాలా కాలంగా నిలిచి పోయిన ఒక నగదు మొత్తం, ఇంత త్వరగా వస్తుందని ఆశించనిది, అకస్మాత్తుగా తనకు లభించిందని చెప్పాడు. ఈ విధంగా అల్లాహ్ తఆలా చందా శుభంతో అన్ని పనులను పూర్తి చేశాడు. దీనివల్ల నా విశ్వాసం కూడా పెరిగింది మరియు త్యాగం చేసే వారి పట్ల అల్లాహ్ వ్యవహారం ఎలా ఉంటుందో నేను కళ్లారా చూశాను.

వఖ్ఫె జదీద్ ఆర్థిక జిహాద్ (కృషి) లో త్యాగాలు చేసిన వినమ్రుల విశ్వాసాన్ని పెంపొందించే వివిధ సంఘటనలను మరియు వారిపై కురిసిన అల్లాహ్ అసాధారణ అనుగ్రహాలను ప్రస్తావించిన తరువాత, హుజూరె అన్వర్ వివిధ దేశాలు మరియు జమాఅత్‌ల స్థానాలను వివరించారు.

అల్లాహ్ తఆలా అనుగ్రహంతో వఖ్ఫె జదీద్ ఈ సంవత్సరంలో ప్రపంచవ్యాప్త అహ్మదియ్యా జమాఅత్ తరపున సుమారు 15 మిలియన్ పౌండ్ల ఆర్థిక త్యాగం సమర్పించబడింది. ఈ వసూళ్లు గత

సంవత్సరం కంటే 1.3 మిలియన్ పౌండ్ల కంటే ఎక్కువ. **వసూళ్ల పరంగా ప్రపంచవ్యాప్తంగా మొదటి పది జమాఅత్‌లు:** బ్రిటన్, కెనడా, జర్మనీ, అమెరికా, భారత్, ఆస్ట్రేలియా, మిడిల్ ఈస్ట్ లోని ఒక జమాఅత్, ఇండోనేషియా, మిడిల్ ఈస్ట్ లోని ఒక జమాఅత్, బెల్జియం. **ఆఫ్రికాలోని మొదటి పది జమాఅత్‌లు:** ఘానా, మారిషస్, బుర్కినా ఫాసో, తంజానియా, నైజీరియా, లైబీరియా, గాంబియా, సీరా లియోన్, బెనిన్ మరియు మాలి. **పాల్గొనేవారి సంఖ్యలో పెరుగుదల పరంగా ప్రముఖ జమాఅత్‌లు:** నైజీరియా, నైజర్, గాంబియా, గినీ బిసావు, కాంగో బ్రజావీల్, ఐవరీ కోస్ట్, సెంట్రల్ ఆఫ్రికా మరియు కాంగో కిన్షాసా.

**భారతదేశంలోని మొదటి పది రాష్ట్రాలు:** కేరళ, తమిళనాడు, జమ్మూ కాశ్మీర్, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా, పంజాబ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్.

**భారతదేశంలోని మొదటి పది జమాఅత్‌లు:** కోయంబత్తూరు, హైదరాబాద్, ఖాదియాన్, కాలికట్, మేలపాలయం, బెంగళూరు, మంజేరి, కోల్‌కతా, కేరంగ్, కరులాయి.

అల్లాహ్ తఆలా ఈ త్యాగం చేసిన వారందరి సంపదలో మరియు ప్రాణాలలో అపారమైన అనుగ్రహం ప్రసాదించుగాక.

కొన్ని జమాఅత్‌ల పేర్లను నేను చదువుతుంటాను ఎందుకంటే తమ స్థానం ఏమిటో తెలుసు కోవాలని వారు ఆశిస్తారు, అందుకే సంప్రదాయం ప్రకారం చదవబడుతోంది.

ముగింపులో ఆర్థిక త్యాగ ప్రాముఖ్యతపై ఆధారపడిన హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారి ఒక ఉల్లేఖనం వెలుగులో హుజూరె అన్వర్ ఇలా ఉపదేశించారు: ఇది అల్లాహ్ తఅలా ప్రత్యేక అనుగ్రహం మరియు అల్లాహ్ ప్రజలను ఎలా ఆశీర్వదిస్తూ పోతాడో మేము అనుభవపూర్వకంగా చూశాము, ఎందుకంటే అన్ని ఖజానాలు (నిధులు) అల్లాహ్ తఅలా వద్దే ఉన్నాయని వారు నమ్ముతారు. అతడు పరలోకంలో వారిని ఆశీర్వదిస్తాడు, కానీ ఈ లోకంలో కూడా ఆశీర్వదిస్తూనే ఉంటాడు. అల్లాహ్ తఅలా మనల్ని ఎలా ఆశీర్వదిస్తున్నాడో చూసి మనిషి ఆశ్చర్యపోతాడు. అల్లాహ్ తఅలా భవిష్యత్తులో కూడా మనకు ఆర్థిక త్యాగాలు చేసే అనుగ్రహం ప్రసాదిస్తూ మన విశ్వాసాన్ని, నమ్మకాన్ని పెంచుతూ పోవునుగాక! (ఆమీన్)

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔